
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
నంద్యాల
జిల్లా వార్తలు 3
శుక్రవారం 17 అక్టోబరు 2025







కర్నూలు గడ్డపై దేశాధినేత





జనం.. ప్రభంజనం.. న'మోదీ'జనం.. కర్నూలు గడ్డపై కనీవినీ ఎరుగని రీతిలో జరిగిన ప్రధాని మోదీ సభ సూపర్ సక్సెస్‌గా నిలిచింది. 20 రోజులుగా మోదీ పర్యటన ఏర్పాట్ల ఫలితంగా 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' బహిరంగ సభ విజయవంతం కావడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన నేత ఎదుగుతున్న ప్రధాని నరేంద్ర మోదీ కోసం ప్రజలు వెల్లువలా తరలివచ్చారు. సుపరిపాలన పేరుతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్న విజనరీ సీఎం నారా చంద్రబాబు నాయుడు పిలుపుతో మహిళలు కందనవోలు వైపు అడుగులు వేశారు. డిప్యూటీ సీఎం, అభిమాన హీరో పవన్ కళ్యాణ్‌ను చూసేందుకు వచ్చిన యువత కేరింతలు, కోలాహలం మరో వైపు... వెరసి ఓర్వకల్లు మండలం నన్నూరులో నిర్వహించిన ప్రధాని జయప్రదమైంది. మహిళలు, యువతతో పాటు వృద్ధులు సైతం తమ అభిమాన నేతలను చూసేందుకు తరలివచ్చారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు, భద్రతలో కేంద్ర బలగాలు... ఇలా ఎవరికి వారు తమ విధులను బాధ్యతగా నిర్వహించడంతో సభ సాఫీగా సాగింది. ఇదే క్రమంలో ప్రధాని మోదీ రాష్ట్రంతో పాటు రాయలసీమకూ వరాలజల్లు కురిపించారు. అందులోనూ కర్నూలుకు తన పూర్తి సహకారం ఉంటుందంటూ భరోసానిచ్చారు. 'సౌరాష్ట్రే సోమనాథ.. శ్రీశైలే మల్లికార్జున..' అంటూ మోదీ తన ప్రసంగాన్ని ప్రారంభించగా... మధ్యలో మహానందీశ్వర స్వామి, అహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలంటూ ప్రసంగించారు. ఇదిలా ఉండగా ఆంగ్లేయుల పాలిట సింహస్వప్నంగా నిలిచిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరును ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు తమ ప్రసంగాల్లో ప్రస్తావించారు. ఉయ్యాలవాడ పేరు వినగానే ప్రజలు హర్షధ్వానాలతో తమ అభిమానాన్ని చాటుకున్నారు.









ప్రధానికి ప్రత్యేక జ్ఞాపికలు



ప్రధాని మోదీకి జ్ఞాపికను అందజేస్తున్న సీఎం, డిప్యూటీ సీఎం

ఆత్మకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల పర్యటనకు గురువారం విచ్చేసిన భారత ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యేకమైన జ్ఞాపికలను అందజేశారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల దర్శనం అనంతరం ఆశీర్వచన మండపానికి చేరుకున్న ఆయనకు అర్చకుల వేదాశీర్వచనాల అనంతరం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వామి, అమ్మవార్ల చిత్రాలతో చెక్కతో ప్రత్యేకంగా తయారుచేసిన జ్ఞాపికను అందజేశారు. ఆ తర్వాత ఆయన శివాజీ స్ఫూర్తి కేంద్రం సందర్శించగా అక్కడ ఆర్ఎస్ఎస్ క్షేత్ర ప్రచారక్ ఎస్.భరత్, స్ఫూర్తి కేంద్రం ఆర్గనైజర్ సెక్రటరీ నాగేశ్వరరావు శివాజీ స్ఫూర్తి కేంద్రం నిర్మాణాలతో పాటు శివాజీ మహరాజ్ విగ్రహ ప్రతిమలు కలిగిన గాజు అమరిక ఉన్న జ్ఞాపికను అందజేశారు

మోదీకి ఘన స్వాగతం



ప్రధాని మోదీకి స్వాగతం పలకడానికి శ్రీశైలం చేరుకున్న మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల దర్శనార్థం గురువారం శ్రీశైల పర్యటనకు విచ్చేసిన ప్రధాని నరేంద్రమోదీకి ప్రధాన ఆలయం వద్ద పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక కాన్వాయ్‌లో గంగాధర్ మంటపం వద్దకు చేరుకున్న ఆయనను దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిలతో పాటు చీఫ్ సెక్రటరీ విజయానంద్, డీజీపీ హరీష్ గుప్తా, దేవదాయశాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్, శ్రీశైల దేవస్థానం ఈవో శ్రీనివాసులు స్వాగతం పలికారు. వీరితో పాటు శ్రీశైలం నియోజకవర్గం బీజేపీ, జనసేన పార్టీల ఇన్‌చార్జ్‌లు మోమిన్ షబాన, అశోక్ స్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాత్రమే ప్రధాన ఆలయంలోకి దర్శనానికి వెళ్లారు.

ముగిసిన ఆభరణాల లెక్కింపు



బంగారు, వెండిని లెక్కిస్తున్న అధికారులు

బనగానపల్లె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత దేవస్థానంలో మూడు రోజులుగా జువెల్లరీ వెరిఫికేషన్ అధికారి పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నఅమ్మవారి బంగారం, వెండి ఆభరణాల లెక్కింపు గురువారంతో ముగిసినట్లు నందవరం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. జేవీవో పాండురంగారెడ్డి దేవస్థానంలో బంగారు, వెండి ఆభరణాలకు సంబంధించి ఆభరణాలు అప్రైసర్ చేసినట్లు తెలిపారు. గత ఈవోలు రామానుజన్, కామేశ్వరమ్మ బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలు అప్పగించినట్లు తెలిపారు. దేవస్థానంలో 7కిలోల 497 గ్రాముల 550 మిల్లీ గ్రాముల బంగారు ఉన్నట్లు తెలిందన్నారు. అలాగే 244 కిలోల 717 వెండి ఉన్నట్లు తెలిపారు. ఈ ఆభరణాలను తిరిగి బ్యాంకుల్లో భద్రపరచనున్నట్లు ఆయన తెలిపారు.

శ్రీశైలంలో చిరుత హల్‌చల్

శ్రీశైలం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాం వద్ద బుధవారం అర్ధరాత్రి చిరుత హల్‌చల్ చేసింది. డ్యాం వద్ద విధుల్లో ఉన్న ఎస్పీఎఫ్ సిబ్బందికి చిరుత కనపించడంతో తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. డ్యాం పరిసర ప్రాంతాల్లో చిరుత సంచారం షరామామూలుగా ఉందని ఎస్పీఎఫ్ వర్గాలు తెలిపాయి. అర్ధరాత్రి నుంచి మూడు గంటల వరకు ఆ ప్రాంతంలో సంచరించినట్లు సిబ్బంది పేర్కొంది. డ్యాం పై నుంచి పోయి వ్యూపాయింట్ వద్దకు చేరుకొని అక్కడ కుక్కపై దాడి చేసినట్లు చెప్పారు. చిరుత సంచారంపై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించినా లాభం లేదని వారు తెలిపారు. చిరుత సంచారంపై విధుల్లో ఉన్న ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారు.



విద్యార్థులతో లోకేశ్ మమేకం

4లో

విషాదం నింపిన విహారయాత్ర

- గాజులదిన్నె ప్రాజెక్టు నీటిలో పడి ఇద్దరు మృతి
- ఒకరి మృతదేహం లభ్యం..

5లో



బీసీ గురుకుల పాఠశాల తనిఖీ

- నాణ్యత లేని సరుకులపై మంత్రి సవిత ఆగ్రహం

వెల్దుర్తి టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తిలోని మహాత్మ జ్యోతిబా పూలే పాఠశాలను బీసీ గురుకుల పాఠశాలను బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలో సరుకులు నాణ్యత లేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగా ఆమె పాఠశాలలో కల్పిస్తున్న వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పాఠశాలకు సొంత భవనం, మైదానం ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు ఆమె స్పందిస్తూ ఈ విషయంపై పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు తమ దృష్టికి తెచ్చారని, త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఆమె స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. అందులో ప్రతి వస్తువు నాణ్యత లోపించడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే విద్యార్థులకు అందించే గుడ్డు కేవలం పూర్తి చిన్న సైజు ఉండటంతో ఆమె స్వయంగా గుడ్లను తూకం వేశారు. 40గ్రాముల గుడ్డు రావడంతో గుడ్లతో పాటు సరుకులను పరీక్షకు పంపించాలని మంత్రి సవిత పీఏకు సూచించారు. అలాగే స్టాఫ్ రిజిస్టర్, గోడౌన్ స్టాక్ రిజిస్టర్ అందుబాటులో లేకపోవడంతో ఇందుకు ఆమె రిజిస్టర్ బుక్‌లో కంప్లైంట్ రాశారు. కళాశాలలోని ప్రతి వస్తువును, ప్రతి రూమ్‌ను, భోజనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం స్థానిక టీడీపీ సీనియర్ నాయకులు జ్ఞానేశ్వర్‌గౌడు, బొమ్మిరెడ్డిపల్లె సుబ్బరాయుడుతో మాట్లాడుతూ స్థానిక టీడీపీ లీడర్లు పాఠశాలపై దృష్టి సారించాలని, వాటి వల్ల నిర్వహణ అభివృద్ధి చెందుతుందని సూచించారు.



పరిశీలిస్తున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత


నమో.. శివ

- శ్రీశైలం ఆలయం వద్ద ప్రధానికి పూర్ణకుంభంతో స్వాగతం
- భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు ప్రత్యేక పూజలు
- వేదాశీర్వచనాలు అందించిన పండితులు, అర్చకులు
- ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్రం సందర్శన
- శ్రీశైలంలో మూడు గంటల పర్యటన
- పటిష్ట పోలీసు బందోబస్తు

4లో



ప్రధాని పర్యటన హైలెట్స్





కర్నూలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి):

- ప్రధాని మోదీ నంద్యాల జిల్లా శ్రీశైలానికి చేరుకుని జ్యోతిర్లింగం, శక్తిపీఠ క్షేత్రాలు దర్శనం అనంతరం 2:35 గంటలకు కర్నూలు నగరం రాగమయూరి గ్రీన్‌హిల్స్‌లో సభా ప్రాంగణం దగ్గర హెలీప్యాడ్ చేరుకున్నారు.
- 2:40 గంటలకు చంద్రబాబు, పవన్ కలిసి రోడ్‌షో నిర్వహించారు
- సభకు వచ్చిన ప్రజలు జయహో..జయహో.. అంటూ జాతీయ జెండాలు ఊపుతూ ఉత్సాహంతో పరవశించారు
- 2:48 గంటలకు మంత్రి నారా లోకేశ్, టీజీ భరత్, పయ్యావుల కేశవ్, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని వేదికపైకి చేరుకున్నారు.
- 2:53 గంటలకు గవర్నర్ అబ్దుల్ నజీర్ వేదికపైకి చేరుకున్నారు. ఆ తరువాత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వేదికపైకి వచ్చారు. ఆయన రాగానే జనసైనికుల కేరింతలు, హర్షధ్వానాలతో సభా ప్రాంగణం మారుమోగింది.
- ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు వేదికపైకి రాగానే ఒక్కసారిగా జాతీయ జెండాలు ఊపుతూ మోదీ.. మోదీ అంటూ సభా ప్రాంగణం మారుమోగింది. చంద్రబాబు మరింత ఉత్సాహపరుస్తూ మోదీ.. మోదీ అంటూ గట్టిగా నినదించాలని అన్నారు.
- ప్రధాని మోదీని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు సన్మానించి పరమేశ్వరుడి జ్ఞాపికను అందజేశారు.
- వేదికపైన ఉన్న మంత్రి లోకేశ్‌ను ప్రధాని మోదీ పిలిచి ఓ పుస్తకం ఇచ్చారు.
- మహిళలు, రైతులు, విద్యార్థులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు
- ప్రధాని మోదీ సోదరా.. సోదరిమణులు అంటూ తెలుగులో ప్రసంగం మొదలు పెట్టారు
- 3:43 గంటలకు ప్రసంగం మొదలు పెట్టిన ప్రధాని మోదీ 4:17 గంటలకు ముగించారు
- మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 4:25 గంటల వరకు ప్రధాని సభ జరిగింది. అయితే.. 12 గంటలకే సభికులను గ్యాలరీలోకి పంపించారు. సభ ముగిసే వరకు ఎలాంటి ఆహారం ఇవ్వకపోవడంతో పలువురు ఇబ్బందులు పడ్డారు.



సభకు వేలాది బస్సులు ఇలా...


పొలాల వెంబడి పరుగులు





నమో.. శివ

నంద్యాల/ శ్రీశైలం/ ఆత్మకూరు, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ గురువారం శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్నారు. ముందుగా సున్నిపెంట హెలిప్యాడ్ వద్ద ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ సునీల్ షెరాన్ ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రధాని కాన్వాయ్ శ్రీశైల మల్లన్న క్షేత్రానికి రోడ్డు మార్గాన చేరుకుంది. కార్యక్రమంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ పాల్గొన్నారు.



ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రధాని నరేంద్ర మోదీకి ఆలయ ప్రధాన అర్చకులు వీరన్నస్వామితో పాటు పలువురు అర్చకులు, వేద పండింతులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మల్లికార్జున స్వామికి జ్యోతిర్లింగానికి ఏక వార రుద్రాభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన, పంచామృతాలతో ప్రత్యేక పూజలు చేశారు. భమ రాంబదేవికి ఖడ్గమాల, కుంకమార్చన పూజలు చేశారు. మల్లిక గుండమ్మ దర్శనం చేసుకున్నారు. ఇదే క్రమంలో అమ్మవారి ఆలయ ప్రాకార మండపంలో ప్రధానికి వేద పండితులు వేదాశీర్వచనాలు ఇచ్చారు. అర్చక స్వాములు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. చివరికి సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శేషవస్త్రాలు, స్వామి అమ్మవార్ల చిత్ర పటమును మోదీకి అందజేశారు. మొత్తంగా సుమారు 40 నిమిషాల పాటు మల్లన్న సేవలో మోదీ తరించారు.



- శ్రీశైలం ఆలయం వద్ద ప్రధానికి పూర్ణకుంభంతో స్వాగతం
- భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు ప్రత్యేక పూజలు
- వేదాశీర్వచనాలు అందించిన పండితులు, అర్చకులు
- తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేత
- ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్రం సందర్శన
- శివ సేవకులతో కాషామయమైన క్షేత్రం
- ప్రధాని మోదీ వెంట సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- శ్రీశైలంలో మూడు గంటల పర్యటన
- పటిష్ట పోలీసు బందోబస్తు

శివాజీ విగ్రహానికి పుష్పాంజలి

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో కలిసి మధ్యాహ్నం 12.35 గంటలకు ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని మోదీ సందర్శించారు. ముందుగా శివాజీ దర్బార్, గోడలపై ఛత్రపతి శివాజీ జీవిత చరిత్రపై శిల్పాలతో చిత్రీకరించిన చిత్రమాలికలను ఆసక్తిగా తిలకించి శివాజీ విగ్రహానికి పూలమాల వేసి పుష్పాంజలి తెలియజేశారు. ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్రం నిర్వాహకులను అభినందించారు. నిర్వాహకులు టీజీ వెంకటేష్, సుబ్బారెడ్డి కలిసి శివాజీ స్ఫూర్తి కేంద్రం జ్ఞాపికను అందజేశారు.

వేలాది మంది శివసేవకులు..

ప్రధాని మోదీ రాకతో శ్రీశైలం భక్తులతో పాటు శివసేవకులు కాషాయ వస్త్రధారణలో నిండిపోయింది. పోలీసులు బారికేడ్లు వేసి అడ్డుగా లేకుండా అదుపుచేశారు. మోదీ సైతం నంది మండపం సర్కిల్ నుంచి గంగాధర మండపం వరకు రాగా అటుగా ఉన్న భక్తులు, వేలాది మంది శివసేవకులు హరహర మహాదేవ నినాదంతో హోరెత్తించారు. మోదీ సైతం వాహనంలో నుంచే అభివాదం చేశారు. ఆ ప్రాంతం సందడిమయంగా మారింది.

1,800 మంది పోలీసులతో బందోబస్తు

శ్రీశైలానికి మోదీ రాక నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. సుమారు 1,800 మంది పోలీసులతో శ్రీశైలంలో భద్రత కట్టుదిట్టం చేశారు. ఎస్పీ సునీల్ షెరాన్, ఈగల్ ఐజీ ఆర్‌కే రవికృష్ణ, ఐపీఎస్ అధిరాజ్ సింగ్ రాణా పర్యవేక్షణలో మోదీ పర్యటన సాగింది. ఇదే క్రమంలో శ్రీశైలానికి వచ్చే భక్తుల వాహనాలు ఎక్కడికక్కడ ముందస్తుగా ప్రకటించి నిలిపివేశారు.

మధ్యాహ్నం 2గంటలకు సున్నిపెంట..

ప్రధాని మోదీ శ్రీశైలంలో సుమారు మూడు గంటల పాటు పర్యటించారు. ఉదయం 10.51 గంటలకు మోదీ సున్నిపెంటకు వచ్చారు. 11గంటలకు భ్రమరాంబ అతిథిగృహానికి చేరుకున్నారు. 11.30 గంటలకు శ్రీశైల మల్లన్న దర్శనానికి బయలుదేరారు. 40 నిమిషాలు పాటు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి మధ్యాహ్నం 12.30గంటలకు ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. మధ్యాహ్నం 2గంటలకు సున్నిపెంట హెలిప్యాడ్ నుంచి కర్నూలు(ఓర్వకల్లు)కు బయలుదేరి వెళ్లారు.

సైడ్ లైట్స్

- ఓర్వకల్లు నుంచి సున్నిపెంటకు ప్రత్యేక విమానంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌తో కలిసి 10.52కు సున్నిపెంట హెలిప్యాడ్‌కు చేరుకున్నారు.
- అక్కడి నుంచి రోడ్డు మార్గాన ప్రత్యేక కాన్వాయ్‌లో ముగ్గురు వేర్వేరుగా భ్రమరాంబ అతిథిగృహానికి 11.02 గంటలకు చేరుకొని అరగంట విశ్రాంతి తీసుకున్నారు.
- 11.32 గంటలకు భ్రమరాంబ అతిథిగృహం నుంచి శ్రీశైల మల్లన్న క్షేత్రానికి బయలు దేరారు. నంది సర్కిల్ నుంచి గంగాధర్ మండపం మీదుగా దేవాలయం ప్రధాన ద్వారం వద్దకు 11.35కి చేరుకున్నారు.
- 11.40 గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు వీరన్నస్వామి రాజగోపురం వద్ద పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.
- 11.45 గంటలకు ఆలయ ధ్వజస్తంభానికి నమస్కరించి స్వామివారి ఆలయంలో రత్నగర్భ గణపతికి పూజలు చేశారు.
- భ్రమరాంబదేవి అమ్మవారి ఆలయ దర్శనానికి కాలినడన వెళ్లే క్రమంలో అక్కడ ఉన్న సాధు సంతువులకు ప్రధాని మోదీ అభివాదం చేస్తూ దర్శనానికి వెళ్లారు.
- మధ్నాహ్నం 12.20 గంటలకు పూజల అనంతరం ఆలయ పుష్కరిణి మీదుగా ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్రానికి 12.35 గంటలకు మోదీ సీఎం, డిప్యూటీ సీఎంతో కలిసి సందర్శించారు.
- మధ్యాహ్నం 12.55 గంటలకు శివాజీ స్ఫూర్తి కేంద్రం నుంచి భ్రమరాంబ అతిథిగృహానికి చేరుకొని, సుమారు 50 నిమిషాల పాటు సీఎం, డిప్యూటీ సీఎంలతో ఆలయాభివృద్ధి తదితర అంశాలపై చర్చించినట్లు తెలిసింది.
- 1.45 నిమిషాలకు అతిథిగృహం నుంచి సున్నిపెంట హెలిప్యాడ్‌కు ప్రత్యేక కాన్వాయ్‌లో వారు ముగ్గురు బయలుదేరారు.
- మధ్యాహ్నం 2 గంటలకు సున్నిపెంట హెలిప్యాడ్ నుంచి ఓర్వకల్లుకు ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి వెళ్లారు.

కర్నూలు పౌరుషాల గడ్డ : మంత్రి నారా లోకేశ్



కర్నూలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కర్నూలు పౌరుషాల గడ్డ అంటూ ప్రసంగం మొదలు పెట్టారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పౌరుషాలకు పేరుగాంచిన సీమ బిడ్డ కర్నూలు జిల్లా ప్రజల రాజసం కొండారెడ్డి బురుజు అంటూ గత వైభవాన్ని గుర్తు చేశారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ప్రధాని మోదీ, ఎన్డీఏ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని వివరించారు

ఈ పెద్దమనిషి నాకు తెలుసు

- కోట్లను గుర్తు చేసుకున్న ప్రధాని మోదీ



ప్రధాని మోదీకి ఎమ్మెల్యేలు జయనాగేశ్వర్ రెడ్డి, కోట్ల, కేఈ శ్యాంబాబును పరిచయం చేస్తున్న సీఎం చంద్రబాబు

డోన్ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా నన్నూరు గ్రీన్ హిల్స్ వద్ద జరిగిన సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ సభకు విచ్చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు వద్ద డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డిని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ప్రధాని నరేంద్రమోదీకి కరాచలనం చేసి స్వాగతం పలికారు. ఈ పరిచయం చేయగా... ప్రధానమంత్రి మోదీ చిరునవ్వుతో పెద్ద మనిషి నాకు బాగా తెలుసు కేంద్ర మంత్రిగా పని చేశారు కదా అంటూ అనడం గమనార్హం. అనంతరం ప్రధానమంత్రి ఆత్మీయతకు డోన్ ఎమ్మెల్యే కోట్ల కృతజ్ఞతలు తెలియజేస్తూ ధన్యవాదాలు తెలిపారు. ఈ పర్యటన ప్రాంతీయ అభివృద్ధికి జోష్ నింపుతుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ కర్నూలు ప్రాంతంలో జరుగుతున్న కార్యక్రమాలపై ఎమ్మెల్యే కోట్ల సదుపాయాలు, తాగునీరు, సాగునీటి ప్రాజెక్టులపై ప్రధానితో వివరించారు.

ఆకట్టుకున్న మోదీ వస్త్రధారణ



భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనార్థం శ్రీశైలానికి విచ్చేసిన ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్యాత్మికత ప్రతి బింబించేలా తన వస్త్రధారణ అందరిని ఆకట్టుకుంది. పంచెకట్టులో కాషాయపు రంగు శాలువను ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు కూడా పంచెకట్టులో కనిపించారు.

● ఆత్మకూరు, ఆంధ్రజ్యోతి

డ్రోన్ హబ్‌గా కర్నూలు



- ఉయ్యాలవాడ, గాడిచర్ల స్ఫూర్తి మరవలేనిది
- కర్నూలు సభలో ప్రధాని నరేంద్ర మోదీ
- త్వరలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు
- ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్ పెట్టుబడులకు స్వర్గ ధామం
- సీఎం చంద్రబాబునాయుడు
- వెల్లువలా తరలివచ్చిన అశేష జనవాహిని
- 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' సభ సూపర్ సక్సెస్
- రాగమయూరి గ్రీన్‌హిల్స్ జనసంద్రం

కర్నూలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కందనవోలు జన పర వళ్లలో పులకరించింది. దేశ, రాష్ట్ర పాలనాధీశులు కర్నూలు గడ్డపై సీమ పౌరుషాన్ని కొనియాడారు. జన సందోహాన్ని చూసిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, విద్య, ఐటీ శాఖ మంత్రి నారాలోకేశ్ ఆనందంతో పరవశించిపోయారు. జిల్లా యం త్రాంగం, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకుల సమష్టి కృషి కందనవోలు ఖ్యాతిని జాతీయస్థాయికి తీసుకెళ్లారు. సీఎం చంద్ర బాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా దేశంలోనే తొలిసారిగా కర్నూలు గడ్డపై నిర్వహించిన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ సభ సూపర్ సక్సెస్ అయ్యింది. ఈకార్యక్రమానికి వేదిక అయినా రాగమయూరి గ్రీన్‌హిల్స్ జనసంద్రమైంది. పూల వర్షంతో కూటమి అతిరథ మహారథులను ముంచేశారు. సీమ సంప్ర దయాలను ఇనుమడింపజేసే కళాప్రదర్శలు, సంస్కృతిక కార్యక్ర మాలు కనువిందు చేశాయి. ఏ ఒక్కరికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించారు. విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు మృతి చెందడం మినహా భారత ప్రధాని మోదీ హాజరైన భారీ బహిరంగ సభ గురువారం ప్రశాంతంగా.. దిగ్విజయంగా ముగియడంతో జిల్లా యంత్రాంగం, కూటమి నేతలు సంతోషంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రధాని మోదీ శ్రీశైలం విశిష్టత, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, గాడిచర్ల హరిసర్వోత్తమరావు స్ఫూర్తిని కొనియాడుతూ ప్రసంగం మొదలు పెట్టడంతో సభా ప్రాంగణం హర్షధ్వానాలతో మార్మోగింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాన్, యువనేత నారా లోకేశ్ ప్రసంగం కూటమి నేతల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది.

సరికొత్త అధ్యాయనానికి నాంది

భారతదేశంలో సరికొత్త అధ్యాయనానికి కర్నూలు డ్రోన్ హబ్ నాంది పలుకుతుం దని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో డ్రోన్లు ఎంతో శక్తివంతంగా పనిచేసి సత్తా చాటాయని, అలాంటి డ్రోన్ల తయారీకి వేదికగా ఓర్వకల్లు కాబోతుందన్నారు. ఓర్వకల్లు, కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి ద్వారా రాయలసీమ ప్రాంతం పెట్టుబడులకు స్వర్గధామం అవతుందని గుర్తుచేశారు. జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన అహోబిలం నరసింహస్వామి, మహానంది నందీశ్వరుడు, శ్రీశైలం జ్యోతిర్లింగం, మంత్రాలయం రాఘవేంద్రస్వాములు ఆశీస్సులు ఆకాంక్షిస్తూ మొదలు పెట్టిన మోదీ ప్రసంగం సభికులను ఉత్సాహ పరిచింది. తొలి స్వాతంత్ర్య సమరయోదుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పౌరుషాన్ని, హరిసర్వోత్తమరావు స్ఫూర్తిని మోదీ కొనియాడడంతో ఆప్రాంతంపై ఆయనకు ఉన్న అనురాగాన్ని గుర్తుచేసింది.

ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్‌తో...

కర్నూలుకు త్వరలోనే హైకోర్టు బెంచ్ రాబోతుందని సీఎం చంద్ర బాబు అన్నారు. ఓర్వకల్లు డ్రోన్ సిటీ భారతదేశానికి తలమానికం కాబోతుందని గుర్తుచేశారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్‌తో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది. ఫుడ్ ప్రాసెసింగ్, సిమెంట్ పరిశ్రమలు రాబోతున్నాయని సీఎం వివరించారు. సెమీ కండక్టర్, చిప్ తయారీకేంద్రంగా ఓర్వకల్లు మారుతుందన్నారు.

ఘన స్వాగతం.. వీడ్కోలు

కర్నూలు, శ్రీశైలం పర్యటనలో భాగంగా జిల్లాకు వచ్చిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాసవర్మకు జిల్లా నాయకులు ఘన స్వాగతం,వీడ్కోలు పలికారు. ఢిల్లీ నుంచి ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకున్న ప్రధాని మోదీకి గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, రాష్ట్ర మంత్రి టీజీ భరత్, బీజీ జనార్ధన్‌రెడ్డి, ఎన్‌ఎండీ ఫరూక్, ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు పి.తిక్కారెడ్డి, మల్లెల రాజశేఖర్, జనసేన ఇన్‌చార్జి చింతా సురేశ్, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు గౌరు చరిత, కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, బొగ్గుల దస్తగిరి, బీవీ జయనాగేశ్వరరెడ్డి, కేఈ శ్యాంబాబు, డాక్టర్ పార్థసారథి, భూమా అఖిలప్రియ, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, గిత్తా జయసూర్య, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, నందికొట్కూరు. ఆదోని, ఆలూరు, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జిలు గౌరు వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, వైకుంఠం జ్యోతి, ఎన్.రాఘవేంద్రరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ రీజినల్ చైర్మన్ పూల నాగరాజు, వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి, ఆదోని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అక్కంతోట రామకృష్ణ, సీనియర్ నాయకుడు పురుశోత్తం రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్, కప్పట్రాళ్ల బొజ్జమ్మటీడీపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి వెంకటరాముడు, కురవ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప తదితరులు స్వాగతం పలికారు.

విద్యార్థులతో లోకేశ్ మమేకం

- జీఎస్టీ వ్యాసరచన పోటీల్లో విజేతలకు అభినందనలు
- విద్యార్థులను అభినందించిన గవర్నర్



కర్నూలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రధాని పర్యటన నిమిత్తం కర్నూలు జిల్లాకు వచ్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థులతో కాసేపు మమేకమయ్యారు. 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై జిల్లాలో వివిధ పాఠశాలల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులను నారా లోకేశ్ అభినందించారు. ఆయనతో పాటు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ కూడా విద్యార్థులను అభినందించారు. గురువారం జీఎస్టీ సభా వేదిక సమీపంలోని క్యాంపులో జీఎస్టీ 2.0 ప్రయోజనాలపై డ్రాయింగ్, వ్యాసరచన, వకృత్వ పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులు, ఉపాధ్యాయులు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రి నారా లోకేశ్‌లను కలుసుకున్నారు. వారితో సరదాగా ముచ్చటించిన మంత్రి లోకేశ్ విజేతలను అభినందించారు. జీఎస్టీ 2.0 ప్రయోజనాలపై ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించాలని కోరారు. విద్యార్థులను కర్నూలు డీఈఓ శామ్యూల్‌పాల్ దగ్గరుండి మంత్రి లోకేశ్‌కు పరిచయం చేయించారు.



విషాదం నింపిన విహారయాత్ర

- ఒకరి మృతదేహం లభ్యం.. మరొకరి కోసం గాలింపు


చెన్నారెడ్డి మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న గజ ఈతగాళ్లు


చెన్నారెడ్డి(ఫైల్)


ఉదయ్‌కుమార్

గోనెగండ్ల/ఎమ్మిగనూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విహార యాత్రకు వెళ్లిన ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు గల్లంతు కాగా.. వీరిలో ఒకరి మృతదేహం లభ్యమైంది. మరొకరి ఆచూకీ లభ్యం కాలేదు. ఈ విషాద ఘటన గురువారం జరిగింది. వివరాలివీ.. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన శివ, బాబు, అస్లత్, ధనుంజయ్, శ్రీనాథ్, సాయిగణేశ్, చెన్నారెడ్డి(20), ఉదయ్‌కుమార్ ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ (ఏఐ) మూడో సంవత్సరం చదువుతున్నారు. వీరంతా కళాశాలకు వెళ్తున్నామని చెప్పి గాజులదిన్నె ప్రాజెక్టు సందర్శనకు వెళ్లారు. అక్కడ సంతోషంగా గడిపారు. అనంతరం మూడు గంటల సమయంలో భోజనం చేసి స్నానం చేయడానికి నాలుగో క్రస్ట్ గేట్ దగ్గరకు వెళ్లారు. అక్కడ నీటి విడుదల కొనసాగుతోంది. అక్కడికి వెళ్లిన వారిలో ముగ్గురు విద్యార్థులు చెన్నారెడ్డి, ఉదయ్‌కుమార్, శివ జారిపడ్డారు. శివ అనే విద్యార్థి ప్రాణాలతో బయట పడ్డాడు. ఉదయ్‌కుమార్, చెన్నారెడ్డి నీటిలో కొట్టుకుపోయి కింద ఉన్న నీటి గుంతలో కూరుకుపోయారు. గజ ఈతగాళ్లు గాలింపు చేపట్టారు. చెన్నారెడ్డి మృతదేహం లభ్యం కాగా.. ఉదయ్‌కుమార్ ఆచూకీ లభ్యం కాలేదు. చెన్నారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మేమెలా బతకాలి దేవుడా..


విలపిస్తున్న చెన్నారెడ్డి తల్లిదండ్రులు

చెన్నారెడ్డి తల్లిదండ్రులు మౌలీశ్వరరెడ్డి, శకుంతలమ్మ బోరున విలపించారు. వీరికి కుమారుడు చెన్నారెడ్డి, ఇద్దరు ఆడపిల్లలు సంతానం. ఎమ్మిగనూరులోని వైఎస్ఆర్ సర్కిల్ నందు హోటల్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఒక ఏడాది పూర్తయితే బీటెక్ పూర్తవుతుందని, ఏదో ఒక ఉద్యోగం వస్తే తమను పోషిస్తాడని అనుకున్నామని, ఇలా దూరంగా వెళ్లిపోతాడని అనుకోలేదని కన్నీటి పర్యంతమయ్యారు. మౌలీశ్వర రెడ్డి నీటి మడుగులో దుకెందుకు వెళ్లగా అక్కడి వారు ఆయనను వారించారు.

కాలేజీకి అని చెప్పి వెళ్లాడు

కాలేజీకి అని చెప్పి వెళ్లాడని.. ఇలా గల్లంతయ్యా డని ఎమ్మిగనూరుకు చెందిన ఉదయ్‌కుమార్ తల్లిదండ్రులు గోవిందు, రాధ బోరున విలపించారు. వీరికి ఇద్దరు కుమారులు కాగా.. చిన్న కుమారుడు ఉదయ్‌కుమార్ ఎర్రకోట బీటెక్ కళాశాలలో చదువుతున్నాడు. వీరు చేనేత పనులు చేస్తు జీవనం సాగించే వారు. గురువారం ఉదయం ఇంట్లో టిఫిన్ చేసి ఉదయ్‌కుమార్ అమ్మా కాలేజికి వెళ్లి వస్తానని చెప్పి బయలు దేరాడు. మధ్యాహ్నం మూడున్నర సమయంలో మీ వాడు గాజులదిన్నె ప్రాజెక్టు నీటిలో మునిగి పోయాడని ఫోన్ వచ్చిందని, ఇక్కడ మమ్మల్ని ఇక చూసుకునే వాడే లేడని మేము ఎవరి కోసం బతకాలి అంటూ కన్నీరుమున్నీరయ్యారు.

ఎవరూ స్పందించలేదు..

నీటి ఉధృతిలో తమ కళ్ల ముందే తమ స్నేహితులు కొట్టుకుపోయారని, కాపాడాలని అక్కడున్న వారిని వేడుకున్నా స్పందించలేదని స్నేహితులు రోదించారు. మా రోదనలు వారి మనసులను కరిగించలేదేమో అని, ఆ సమయంలో సహాయం చేసి ఉంటే తమ స్నేహితులు బతికి ఉండేవారేమో మరి అని కన్నీటి పర్యంతమయ్యారు.

అదొక మృత్యు గుంత

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల దగ్గర ఉన్న నీటి గుంత మృతు కుహరంగా మారింది. నీటి విడుదల చేసిన ప్రతి సారి ఒకరిద్దరు ఆ గుంతలోపడి మృతి చెందుతూనే ఉన్నారు. మూగేళ్ల క్రితం కోడుమూరు కు చెందిన గొల్ల సుధాకర్(22) అనే యువకుడు సెల్ఫీ కోసం వెళ్లి నీటి లో చెప్పులు పడిపోవడంతో నీటిలోకి దిగడంతో కొట్టుకుపోయాడా. మూగజీవాలు కూడా అందులో పడి మృతి చెందాయి. ఈ నీటి గుంత క్రస్ట్ గేట్ల నుంచి వచ్చే నీటి ఉధృతికి గుంత పెద్దదిగా మారి ప్రమాదకంగా ఉంది. దీని లోతు దాదాపు రెండు విద్యుత్ స్థంభాల పొడవు ఉంటుందని జాలర్లు చెబుతున్నారు. ఈ ప్రదేశం వైపు ఎవరూ వెళ్లకుండా చూడాలని అధికారులను కోరుతున్నారు.


ప్రమాదం చోటుచేసుకున్న నీటి గుంత ఇదే

గుండెపోటుతో మరో విద్యార్థి..


అబ్దుల్ రహమాన్(ఫైల్)

ఎమ్మిగనూరు: పట్టణానికి చెందిన ఓ విద్యార్థి గురువారం గుండెపోటుతో మృతి చెందారు. వివరాలివీ.. పట్టణంలోని గంగమ్మబావి ప్రాంతంలో నివసిస్తున్న ఫరూక్ చిన్న కుమారుడు అబ్దుల్ రెహమాన్(20) ఎర్రకోట ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ నాలుగో ఏడాది చదువుతున్నాడు. గురువారం యథావిధిగా కళాశాలకు వెళ్లాడు మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత కళ్లుతిరుగుతున్నాయని కుప్పకూలిపడిపోయాడు. తోటి విద్యార్థులు, కళాశాల సిబ్బంది వెంటనే చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యంలో మృతి చెందాడు. కాగా అబ్దుల్ రెహమాన్‌కు చిన్న వయస్సులో గుండె ఆపరేషన్ జరిగినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే గుండెపోటు వచ్చి ఉంటుందని కళాశాలలో చర్చించుకుంటు న్నారు. బీటెక్ పూర్తి అయితే తమ కష్టాలు తొలగిపోతాయని భావించిన తల్లిదండ్రులు కుమారుడి అకాల మృతితో శోకసంద్రంలో మునిగిపోయారు. ఒకే రోజు ముగ్గురు విద్యార్థులు మృతి చెందటం కళాశాలలో విషాదం అలుముకోగా విద్యార్థుల కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

'కర్నూలు ఉత్సవ్'కు సహకరిస్తాం


గుమ్మడి గోపాలకృష్ణను సన్మానిస్తున్న కళాక్షేత్రం ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో నవంబర్ 1 నుంచి వారం పాటు నిర్వహించనున్న 'కర్నూలు ఉత్సవ్'కు రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. గురువారం కర్నూలుకు వచ్చిన ఆయన గురువారం సాయంత్రం టీజీవీ కళాక్షేత్రాన్ని సందర్శించారు. కళాక్షేత్రం అధ్యక్షుడు, పత్తి ఓబులయ్య, కళాకారులు గుమ్మడి గోపాలకృష్ణను సన్మానించి వినతి పత్రం అందజేశారు. మంత్రి కందుల దుర్గేష్, మంత్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారం తీసుకొని ఉత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. కార్యదర్శి సి. యాగంటీశ్వరప్ప, ఉపాధ్యక్షుడు మహ్మద్ మియా, సభ్యులు సంగా ఆంజనేయులు, టీవీ శ్రీనివాసరెడ్డి, కె. బాలవెంకటేశ్వర్లు, పి. రాజారత్నం, కేవీ రమణ, పీపీ గురుమూర్తి, గాండ్ల లక్ష్మన్న, రమేష్ పాల్గొన్నారు.

31 నుంచి విశ్వశాంతి మహాయాగం

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో 87వ విశ్వశాంతి మహాయాగం ఈనెల 31 నుంచి వచ్చేనెల 14 వరకు నిర్వహిస్తున్నట్లు కృష్ణా పీఠాధిపతి కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ తెలిపారు. విపత్తుల నుంచి ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఈ యాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామీజీ మాట్లాడుతూ లోకకల్యాణం కోసం విష్ణుపంచాతనం, అయుత చండీ, అతిరుద్రం, సరస్వతి, మహాగణపతి మహాయాగాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అందరూ ఆహ్వానితులే ఈ పూజా కార్యక్రమానికి రుసుము లేకుండా ఉచితంగా పాల్గొనవచ్చని, యజ్ఞం, హోమానికి కావాల్సిన పూజా సామగ్రిని వేద పండితులు తెలిపిన విధంగా తెచ్చుకోవాలని తెలిపారు. విశ్వశాంతి మహా యాగంలో పాల్గొన్న భక్తులకు అల్పాహారం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కూడా యాగ కమిటీ వారు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ యాగంలో 20 లక్షల దీపోత్సం నిర్వహించబోతున్నట్లు, లక్ష శివలింగాలకు వెయ్యి లీటర్ల పాలతో రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎస్పీకి బెయిలబుల్ వారెంట్లు

కర్నూలు లీగల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఒక సివిల్ కేసులో కోర్టు ఆదేశాలను పాటించనందుకు జిల్లా ఎస్పీకి బెయిలబుల్ వారెంట్లు జారీ చేస్తూ కర్నూలు ప్రిన్సిపల్ సివిల్ కోర్టు ఆదేశాలు జారీచేసింది. ఓకేసులో అర్షియా ఫర్వీన్ ఫిర్యాది తన తండ్రి అయిన పి.రహీంఖాన్ పోలీసు శాఖలో పనిచేస్తూ మృతిచెందాడు. ఆకేసులో డెత్ బెని ఫిట్లకు సంబంధించిన వివరాలను తెలపాల్సిందిగా కోర్టు ద్వారా ఎస్పీని కోరారు. ఈ మేరకు కోర్టు పలుమార్లు సంబంధిత రికార్డులను పంపాలని సంబంధిత సెక్షన్ అధికా రులను కోర్టు కోరింది. స్పందించకపోవడంతో చివరకు కోర్టు జిల్లా ఎస్పీకి సమన్లును జారీ చేసింది. అయినా కూడా జిల్లా ఎస్పీ స్పందించకపోవడంతో కోర్టుల్లో ప్రత్యక్షంగా హాజరై సమాధానం ఇవ్వాలని ఆదేశిస్తూ ఎస్పీకి కోర్టు బెయిలబుల్ వారెంట్లను జారీ చేసినట్లు న్యాయవాది ఎస్.షాషావలి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో అనంతవాసి మృతి

ఆస్పరి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని నగరూరు బస్‌స్టాప్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం పట్టణానికి చెందిన షేక్ దాదుబాషా(36) అక్కడికక్కడే మృతిచెందారు. సీఐ గంగాధర్ తెలిపిన వివరాలివీ.. షేక్ దాదుబాషా ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అనంతపురం నుంచి ఆదోనికి స్కూటర్‌పై వస్తుండగా నగరూరు బస్టాప్ సమీపంలో గుంతను తప్పించబోయి ప్రమాదం చోటు చేసుకుంది. తలకు దెబ్బ తగలడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. దాదుబాషా భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మోదీ సభకు వస్తూ అనంత లోకాలకు..

- విద్యుదాఘాతంతో యువకుడి మృతి
- మరో ఇద్దరికి గాయాలు
- బాధిత కుటుంబానికి విష్ణు రూ.5లక్షల ఆర్థికసాయం
- నేడు మునగాలపాడుకి మంత్రి రవికుమార్


ఆర్థికసాయం అందజేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి


మృతిచెందిన అర్జున్

కర్నూలు రూరల్/ హాస్పిటల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర శివారులో గురువారం నిర్వహించిన ప్రధాని మోదీ సభకు వస్తూ ఓ యువకుడు మృతి చెందాడు. మరో ఇద్దరు గాయాల పాలయ్యారు. వివరాలు.. కర్నూలు అర్బన్ మండలంలోని మునగాలపాడుకు చెందిన మాస్టిక్ మద్దిలేటి, రాణెమ్మ కుమారుడు అర్జున్(16) మోదీ సభకు బస్సులో బయలుదేరాడు. సభకు కొద్దిదూరంలో పార్కింగ్ లో బస్సు వెళ్లి ఆగింది. అర్జున్‌తో పాటు మాస్టిక్ రాఘవ, కృపాఅమృత్ ముగ్గురు కాలినడకన సభ వద్దకు వెళ్తున్నారు. దారి పక్కనే ఇనుప పైపుతో పాతిపెట్టిన టీడీపీ, జనసేన జెండాను పీకారు. ముగ్గురు కలిసి రెండు జెండాలను పైకి ఊపుతూ కేరింతలు కొడుతున్న సమయంలో పైన ఉన్న విద్యుత్ తీగలకు జెండాలు తగిలాయి. దీంతో విద్యుదాఘాతానికి గురయ్యారు. ఈఘటనలో రాఘవ, కృపాఅమృత్ గాయాలతో బయటపడ్డారు. అర్జున్ మాత్రం పైపునకు అతుకుపోయి పక్కకు రాలేకపోయాడు. శరీర భాగాలు నల్లగా మారాయి. గ్రామస్థులు వెంటనే అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కేడీసీసీబీ ఛైర్మెన్ విష్ణువర్ధన్‌రెడ్డి సభప్రాంగణం నుంచే నేరుగా ఆస్పత్రికి చేరుకొని కుటుంబ సభ్యులను ఓదార్చి అర్జున్ మృతదేహానికి నివాళులర్పించారు. ప్రస్తుతానికి తనవంతుగా రూ.5లక్షల చెక్కును మృతుడి తల్లి రాణెమ్మకు అందించారు. అర్జున్ అంత్యక్రియలకు అదనంగా మరో రూ.20వేలు నగదు ఇచ్చారు. ఘటన వివరాలను విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. నేడు (శుక్రవారం) మంత్రి గొట్టిపాటి మునగాలపాడుకి వచ్చి అర్జున్ కుటుంబ సభ్యులను పరామర్శించి విద్యుత్‌శాఖ నుంచి మరో రూ.5లక్షలను అందజేయనున్నట్లు విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. మృతిని కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని మునగాలపాడు గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యుత్ ప్రమాదం దురదృష్టకరం

- ఎస్ఈ ఆర్.ప్రదీప్‌కుమార్



కల్లూరు: ప్రధానమంత్రి బహిరంగసభకు వెళ్లివస్తూ యువకుడు మృతిచెందడం దురదృష్టకరమని కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఆర్.ప్రదీప్‌కుమార్ అన్నారు. ప్రధాని సభకు విద్యుత్‌శాఖ తరపున భద్రతా చర్యలు తీసుకున్నామని, 300 మంది విద్యుత్ అధికారులు, సిబ్బంది పనిచేశారన్నారు. అయితే మునగాలపాడు గ్రామానికి చెందిన ఎం.మద్దిలేటి కుమారుడు ఎం.అర్జున్(15) అవగాహన లేమితో ఫోటోషూట్‌లో ఇనుపరాడ్డు 11 కె.వి లెన్‌కు తగలడంతోనే మృతిచెందారన్నారు. మృతుడి కుటుంబానికి విద్యుత్ శాఖ తరపున పరిహారం అందేలా చూస్తామన్నారు.

ప్రధానికి జిల్లా నేతల స్వాగతం


మోదీకి స్వాగతం పలుకుతున్న మంత్రులు ఫరూక్, బీసీ




ప్రధాని మోదీకి నమస్కరిస్తున్న మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, ఎంపీ శబరి, కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి


ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్‌తో కలెక్టర్ సిరి, ఆర్జేడీ శామ్యూల్, డీఈఓ శామ్యూల్‌పాల్, విద్యాశాఖ అధికారులు


ఎస్పీ విక్రాంత్ పాటిల్...


జిల్లా నాయకులతో యువనేత నారా లోకేశ్ సెల్ఫీ

మోదీకి నీరాజనం

ప్రధానిని చూడడానికి ఎగబడిన ప్రజలు

ఆత్మకూరు, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): భ్రమరాంబ, మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శ నార్థం గురువారం శ్రీశైలానికి విచ్చేసిన ప్రధాని మోదీకి ప్రజలు నీరాజనం పలికారు. ఉదయం 11.50లకు మోదీ వాహన శ్రేణి కనిపించడంతో ఒక్కసారిగా జనం మోదీ.. మోదీ.. అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఆయన వెంట సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా వచ్చారు. వీరిద్దరు వాహనాల్లోనే ఉన్నప్పటికీ ప్రధాని మోదీ ప్రజలకు కారులో నుంచే అభివాదం చేస్తూ ముందకెళ్లడంతో ప్రజల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. నంది సర్కిల్ మొదలుకొని అతిథి గృహం వరకు రోడ్డుకు ఇరువైపుల జనం ప్రధానీ మోదీని చూసేందుకు బారులుతీరారు. ప్రజల ఉత్సాహాన్ని గమనించిన మోదీ కారులో నుంచే అభివాదం చేస్తూ తన ప్రయాణాన్ని కొనసాగించారు.


ప్రధాని మోదీని చూసేందుకు తరలివచ్చిన జనం


శ్రీశైలానికి చేరుకున్న నియోజకవర్గ ప్రజలతో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

అదిరిన ఆతిథ్యం..!

ఆత్మకూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ శ్రీశైలంకు రావడంతో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఆతిథ్యం అదిరింది. శ్రీశైలానికి వచ్చిన వారికి ఆతిథ్యంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రజలను సత్రాల్లోకి తీసుకెళ్లి ప్రతి ముగ్గురికి ఒక గది చొప్పున వసతి కల్పించారు. ఆ వెంటనే స్వామి అమ్మ వార్లను దర్శించుకునేందుకు రూ.500 క్యూలైన్ల నుంచి భక్తులను ఉచిత దర్శనానికి తీసుకెళ్లారు. దర్శనం అనంతరం కేటాయించిన సత్రాల్లోనే భోజన, అల్పాహారం వెసులుబాటు కల్పించారు. తిరుగు ప్రయాణంలో అక్కడికి వచ్చిన ప్రతిఒక్కరికి మల్లన్న ప్రసాదాన్ని ఉచితంగా అందజేశారు. రాకపోకల సమయంలో దోర్నాల వద్ద స్నాక్స్, టీ వంటివాటిని సమకూర్చారు. ఇవన్ని చూసిన జనం ఎప్పుడు ఇలాంటి సందర్భం రాలేదంటూ.. మధురానుభూతిని పొందారు. మొత్తానికి ప్రధానీ మోదీ పర్యటన నేపథ్యంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి శ్రీశైల నియోజకవర్గ ప్రజల పట్ల చూపిన ఆదరాభిమానాలపై ప్రతిఒక్కరూ సంతృప్తి వ్యక్తం చేశారు.


సభలో పాల్గొన్న ఏవీ సుబ్బారెడ్డి, ధర్మవరం సుబ్బారెడ్డి

బహిరంగ సభకు తరలివెళ్లిన కూటమి నాయకులు

పాములపాడు/వెలుగోడు/జూపాడుబంగ్లా/కొత్తపల్లి/మహానంది/నంద్యాలరూరల్/నందికొట్కూరు రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు మూడు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల నుంచి ప్రధాని బహిరంగ సభకు కూటమి నాయకులు భారీగా తరలివెళ్లారు. ముందుస్తుగా స్థానిక ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్సుల్లో, ప్రైవేట్ వాహనాల్లో వీరంతా కర్నూలుకు గురువారం చేరుకున్నారు. ఒక్కో మండలం నుంచి మూడువేల నుంచి నాలుగు వేల మంది కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు.


పాములపాడు నుంచి ప్రధాని సభకు వెళ్తున్న కూటమి నాయకులు


జూపాడు బంగ్లా : మండ్లెం నుంచి..


వెలుగోడు మండల కేంద్రం నుంచి..


గడివేముల: దుర్వేసి నుంచి..


కొత్తపల్లి : దుద్యాలలో..

ప్రధాని సభలో టీడీపీ నాయకులు

నంద్యాల రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కర్నూలు జిల్లా నన్నూర్‌లో ఏర్పాటు చేసిన మోదీ బహిరంగ సభలో నంద్యాలకు చెందిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు. గురువారం సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసి ముచ్చటించారు. చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. సభ విజయవంతం కావడంతో ఆనందం వ్యక్తం చేశారు.

పీఎం పర్యటన చిరస్మరణీయం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు


మోదీకి స్వాగతం పలుకుతున్న అభిరుచి మధు

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రధాని నరేంద్రమోదీ పర్యటన చిరస్మరణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. గురువారం ప్రధాని మోదీ శ్రీశైల మహాక్షేత్రంలో కొలువైన భ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవార్లను దర్శించుకోవడం ఒక అపూర్వ ఘట్టమన్నారు. స్వాగత కార్యక్రమంలో తాను పాల్గొనడం జీవితంలో మరచిలేని ఘటమన్నారు. మోదీకి భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం పట్ల ఎంత భక్తి, గౌరవం ఉన్నాయో ఈ పర్యటన ద్వారా స్పష్టమైందన్నారు. ఈ పర్యటన ఆధ్యాత్మికతతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేయాలన్న ఆయన సంకల్పాన్ని తెలియజేస్తుందన్నారు. రాష్ట్రంలో మోదీ రూ.13,430కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం చేయడం సంతోషకర విషయమన్నారు. ఈ అభివృద్ధి పనులు జరిగితే నిరుపేదలకు ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు.

న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి

- ఏపీ పీహెచ్‌సీ డీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అంకిరెడ్డి
- 16వ రోజుకు చేరుకున్న వైద్యుల సమ్మె


ధర్నాలో పాల్గొన్న నంద్యాల వైద్యులు

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వైద్యుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని ఏపీ పీహెచ్‌సీ డీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అంకిరెడ్డి కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యుల సమ్మె 16వ రోజుకు చేరింది. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నంద్యాల జిల్లాలో పీహెచ్‌సీ వైద్యులు విధులు బహిష్కరించి సమ్మెలో ఉన్నారు. గురువారం నంద్యాల జిల్లాకు చెందిన వైద్యులు విజయవాడలో జరిగిన సమ్మెలో పాల్గొన్నారు. ఏపీ పీహెచ్‌సీ డీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అంకిరెడ్డి మాట్లాడుతూ ఏళ్లుగడుస్తున్నా పీహెచ్‌సీ వైద్యులు పదోన్నతులకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, గిరిజన ప్రాంత వైద్యులకు ట్రైబల్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నందికొట్కూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్రమోదీ పర్యటనల వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమి లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు అన్నారు. గురువారం నందికొట్కూరు సీపీఎం కార్యాలయంలో కార్యకర్తల సమావేశం పక్కీర్ సాహెబ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ నరేంద్రమోదీ ఆంధ్ర రాష్ట్రానికి ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా పర్యటించడం వల్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి ప్రజలపైన భారం వేయడం తప్పా మరొకటి లేదని ఆరోపించారు. నరేంద్రమోదీ రాష్ట్ర విభజన సందర్భంగా అంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని, వెనుకబడిన జిల్లాలకు ప్రతి సంవత్సరం జిల్లాకు రూ.50 కోట్లు నిధులు ఇస్తామని, కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేసి రాయలసీమ నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం జాతీయ ప్రాజెక్టు పూర్తి చేస్తామని, అమరావతి, తిరుపతి సభల్లో వాగ్దానం చేశారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, కర్ణ, కొంగర వెంకటేశ్వర్లు, నాగన్న, మధు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

- ఎస్ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు కన్నయ్య


కన్నయ్యను సన్మానిస్తున్న భాషోపాధ్యాయులు

నంద్యాల కల్చరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఎస్ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు కన్నయ్య కోరారు. గురువారం నంద్యాల ఎన్జీవో హోంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్ఎల్‌టీఏ) ఆధ్వర్యంలో విద్యా రంగ సమస్యలపై చర్చా గోష్ఠి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నయ్య మాట్లాడుతూ కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరినా.. జూన్‌లో బదిలీ అయిన హిందీ భాషోపాధ్యాయులను ఇంకా రిలీవ్ చేయకపోవడం సరికాదన్నారు. రిలీవర్లతో సంబంధం లేకుండా వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు ప్రత్యేకంగా అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలన్నారు. అనంతరం భాషోపాధ్యాయులను సత్కరించారు. సమావేశంలో ఎస్ఎల్‌టీఏ ప్రధాన కార్యదర్శి హుస్సేన్‌మియా, నాయకులు అన్నెం శ్రీనివాసరెడ్డి, శేషఫణి, లింగమయ్య, విశ్వనాథ్ రెడ్డి, దామోదర్, రఫీ, నరసింహారెడ్డి, ముస్తఫా పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

- బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్

నంద్యాల కల్చరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తానని బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలోని గాయత్రీదేవాలయంలో ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బ్రాహ్మణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కార్పొరేషన్ చైర్మన్ హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందు చూపుతో బ్రాహ్మణ సంక్షేమానికి ఎంతో ఉపయోగపడే కార్పొరేషన్ ద్వారా అనేక పథకాలు అందిస్తున్నారన్నారు. భవిష్యత్‌లో అనేక కొత్త పథకాలను ప్రవేశపెట్టి బ్రాహ్మణులు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య కార్యదర్శి సుధీర్, డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు, దత్తాత్రేయ శర్మ, ప్రభాకర్, శాంతి, కలిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బుచ్చిరాంప్రసాద్

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకుందాం

- యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్


సమావేశంలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

నందికొట్కూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకుందామని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ అన్నారు. గురువారం నందికొట్కూరులో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధనేతర కార్యక్రమాల వలన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య నానాటికి తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు బడి బోధన తప్ప ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, గూగుల్ లింక్ ఫార్మ్స్, డేటా అప్‌లోడ్, యోగా దినోత్సవాలు, మెగా పేరెంట్ మీటింగ్‌లు, కర్మ యోగి, స్వచ్ఛఆంధ్రా, స్వర్ణాంధ్ర, లీడర్ షిప్ ట్రైనింగ్‌లు, ఎఫ్ఎల్ఎన్ శిక్షణలు, ఎన్ఎంఎంఎస్ పరీక్షలు, బబ్లింగ్ మిడ్‌డే మీల్స్, గుడ్లు, చిక్కీలు, జీఎస్‌టీ పైన వ్యాస రచన పోటీలు, రికార్డులు రిజిస్టర్‌లు తదితర పనులు చేయిస్తున్నారన్నారు. దాంతో ఉపాధ్యాయులు ఉక్కిరిబిక్కిరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వాటి నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ముర్తుజావలి, నాయకులు, ఉపాధ్యాయులు రాముడు, వాసు, రంగస్వామి, జగదీష్, సురేంద్ర, మధు, మనోహర్, నాగేశ్వరరావు, మునీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

డిప్యుటేషన్‌లో వైద్యులు

- ఇబ్బందులు పడుతున్న రోగులు

పాములపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పాములపాడులోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలకు 15 రోజులుగా వైద్యులు రాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా విధులు నిర్వహిస్తున్న వైద్యురాలు సావిత్రిని పగిడ్యాల మండలం ప్రాతకోట గ్రామం లోని హలోపతి వైద్యశాలకు డిప్యుటేషన్‌పై ఉన్నతాధికారులు పంపారు. ఆయుర్వేద మందులకు అలవాటు పడ్డామని, డాక్టర్ లేకపోవడంతో మం దులు ఇచ్చేవారు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పనిచేసిన వైద్యాధికారి లావణ్య నిత్యం వైద్యాశాలకు హాజరై రోగులను పరీక్షించేవారన్నారు. ఇప్పుడు వైద్యులు ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి నెలకొందని ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ వైద్యులను నియమించాలని కోరుతున్నారు.


చికిత్స కోసం వచ్చిన గ్రామస్థులు

దారిపై ధాన్యం రాశులు

- వాహనదారులకు తప్పని తిప్పలు


రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

గడివేముల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు చేతికొచ్చాయి. ఇప్పటికే కొందరు రైతులు కోతలు ప్రారంభించారు. ధాన్యాన్ని ఎండబెట్టుకునేందుకు పొలాల దగ్గర, గ్రామంలో ఖాళీ స్థలాలు లేకపోవడంతో రోడ్లను ఆశ్రయిస్తున్నారు. రహదారిపై ధాన్యం రాశులను కుప్పలుగా పోస్తున్నారు. మండలంలోని కొరటమద్ది గ్రామం నుంచి బిలకలగూడురు గ్రామ వరకు దాదాపు 15 కి.మీ మేర రైతులు ధాన్యాన్ని ఆరబోసుకున్నారు. ఈ రహదారి నంద్యాల, నందికొట్కూరుకు వెళ్లే వాహనాలతో రద్దీగా ఉంటోంది. రైతులు ఆరబోసిన ధాన్యం రాశులతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులు కొన్ని చోట్ల ధాన్యపు రాశులపై నల్లటి టార్పాలిన్ పట్టలను కప్పుతున్నారు. అవి రాత్రి సమయంలో వాహనచోదకులకు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గతంలో బిలకలగూడురు గ్రామ సమీపంలో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు. గడివేముల ఎస్ఐ నాగార్జున్ రెడ్డిని వివరణ కోరగా రోడ్డుపై ధాన్యపు రాశులు ఆరబెట్టుకోవడం వల్ల జరిగే ప్రమాదాలపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. కొన్ని చోట్ల ప్రమాద సూచికలను ఏర్పాటు చేశామన్నారు. రైతులకు మరోసారి అవగాహన కల్పిస్తామని తెలిపారు.

మోదీ నోట మహానంది క్షేత్రం మాట

మహానంది, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ నోట మహానంది క్షేత్రం మాట రావడం హర్షనీయమని ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని అభిప్రాయం వ్యక్తం చేశారు. గురువారం కర్నూలులో జరిగిన జీఎస్టీ విజయోత్సవ సభలో మహానంది కే మహానందీశ్వర స్వామీకో ప్రణామ్ కర్తా హు అంటూ ప్రసంగించడంతో మహానంది ఆలయ విశిష్టత ప్రధాని మోదీ గుర్తించారన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో శ్రీశైలం తర్వాత అంతటి చరిత్ర కలిగిన ప్రసిద్ధి ఆలయంగా మహానంది విరాజిల్లుతోందని అన్నారు. జిల్లాలోని పుణ్య క్షేత్రాల వరుసలో ప్రధాన మంత్రి తన ప్రసంగంలో అహోబిలం తర్వాత మహానంది, మంత్రాలయం క్షేత్రాల గురించి ప్రస్తావించడంతో ప్రాధాన్యత సంతరించుకుందన్నారు.

డ్రోన్‌తో ప్రత్యేక నిఘా


నల్లమల ప్రధాన రహదారిలో డ్రోన్ కెమెరాను పరిశీలిస్తున్న ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి

మహానంది, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ కెమెరాతో ప్రత్యేక నిఘా ఉంచి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తున్నామని ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం మహానంది మండలం గాజులపల్లి సమీపంలోని నల్లమల అడవికి అత్యంత సమీపంలోని గిద్దలూరు-నంద్యాల జాతీయ రహదారి పరిసరాల్లో ఎస్ఐ డ్రోన్ కెమెరాతో పర్యవేక్షించారు. నల్లమల సమీపంలోని గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా నిఘా ఉంచామన్నారు. హద్దుమీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

ఆటో ఢీకొని వృద్ధుడి మృతి


నరసింహుడు

మహానంది, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందాడు. ఈఘటన మహానంది మండలం గాజులపల్లి సమీపంలో గురువారం చోటు చేసుకున్నది. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నరసింహుడు (60)అనే వృద్ధుడు సమీపంలోని తెలుగుగంగ కాల్వ ప్రధాన రహదారి ప్రక్కన నిలబడి ఉండగా, ఆటో వేగంగా వచ్చి ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని చికిత్స నిమిత్తం అటుగా వెళ్తున్న ఎస్ఐ తన వాహనంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ చెప్పారు. ఆటో డ్రైవర్ బాలవర్ధన్‌రాజును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తంగడంచలో పిడుగుపాటు

- తప్పిన ఘోర ప్రమాదం

జూపాడుబంగ్లా, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగడంచ గ్రామంలో గురువారం సాయంత్రం ఉరుముల, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గ్రామానికి చెందిన గోవర్ధనయ్య అనే వ్యక్తి ఇంటి ఆవరణలో పిడుగుపడింది. కుటుంసభ్యులు ఇంట్లో ఉండటంతో ప్రమాదం తప్పింది. ఇంట్లో ఉన్న ఫ్యాన్లు మరమ్మతులకు గురయ్యాయి. విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మౌలాలి

చాగలమర్రి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మౌలాలి, రాష్ట్ర కార్యదర్శి ఏవీ గోపాలకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం చాగలమర్రి ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని, టెట్ పాస్ కావాలని సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం దేశ వ్యాప్తంగా ఉపాధ్యాయులకు నిబంధనలు విధించడం సరికాదని అన్నారు. 2010 ముందు నియా మకమైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మధ్యంతర భృతి, డీఏ, ఆర్థిక బకాయిలను చెల్లిం చాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అదనపు కార్యదర్శి శివశంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా, సహ అధ్యక్షుడు నరసింహరావు, ఆర్థిక కార్యదర్శి మాబుహుసేన్, నాయకులు సుధాకర్‌గుప్త, శేషాద్రి, కృష్ణశాస్త్రి, జయరాజు, రమేష్ బాబు, గురుచంద్రుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాహనాల దారి మళ్లింపు..

వెలవెలబోతున్న ప్రధాన రహదారి, బస్టాండు



బస్సుల రాకపోకలు లేక వెలవెలబోతున్న ప్రధాన రహదారి

బేతంచెర్ల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ కర్నూలుకు రానున్న నేపథ్యంలో బస్సుల దారి మళ్లిం పు చేయడంతో బేతంచెర్ల పట్టణంలోని కర్నూలు-బనగానపల్లె ప్రధాన రహదారి వెలవెలబోయాయి. మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రజలు బస్సుల్లో మోదీ బహిరంగ సభకు తరలివెళ్లడంతో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సైతం ప్రయాణికులు లేక నిర్మానుష్యంగా మారింది.

ఎన్టీఆర్ సభ్యత్వం దేశానికే ఆదర్శం

డోన్ టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సభ్యత్వం కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందని బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి ఏఈ నాగరాజు గౌడు అన్నారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్టీఆర్ సభ్యత్వ కార్డుతో ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5లక్షలు తక్షణ సాయం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రగుంట్ల ఆల శ్రీరాములు, మధు శేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అవుకు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంగపట్నం - శింగనపల్లె గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో కొణిదేడు బాషా, మధులు గురువారం గాయపడ్డారు. ఇద్దరు మోటరు సైకిల్‌పై సంగ పట్నం గ్రామానికి బయలుదేరారు. ఎదురుగా వస్తున్న ట్రాక్టరు మోటర్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఇరువురికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా దస్తగిరిస్వామి గ్యార్మీ

రుద్రవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగుల వరం గ్రామంలో గురువారం దస్తగిరిస్వామి గ్యార్మీని ఘనంగా నిర్వహించారు. తరలివచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. జెండాలను మేళతాళాలతో గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు.

కొలిమిగుండ్లలో మోస్తరు వర్షం



హనుమంతుగుండం సమీపంలో పొలంలో నిలిచిన నీరు

కొలిమిగుండ్ల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొలిమిగుండ్లతోపాటు కనకాద్రిపల్లె, చింతలాయపల్లె, అంకిరెడ్డిపల్లె, మీర్జాపురం తదితర గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. గడిచిన 24 గంటల్లో సుమారు 10మి.మీలకు పైగా వర్షం కురిసినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు మండలంలోని హనుమంతుగుండం, ఎర్రగుడి, నాగిశెట్టి తదితర గ్రామాల్లో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పంట పొలాల్లో నీరు చేరడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు.

సంజామల: మండల వ్యాప్తంగా గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. 30 మిల్లీమీటర్ల వర్షపాతంగా నమోదైంది. వర్షం కారణంగా మొక్కజొన్న నానబెట్టిన రైతులు ఇబ్బందులు పడ్డారు. ధాన్యం తడవకుండా టార్పల్ పట్టలు కప్పి భద్రపరుచుకున్నారు.

కొనసాగుతున్న బాధితుల నిరసన



నిరసన తెలుపుతున్న బాధితులు

దొర్నిపాడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొర్నిపాడు గ్రామంలో హెల్త్ అండ్‌వెల్త్ ఫైనాన్సియల్ కంపెనీలో డబ్బులు పెట్టి మోసపోయిన బాధితులు గురువారం మూడు రోజు రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. దొర్నిపాడు గ్రామానికి చెందిన బాసిరెడ్డి వీరారెడ్డి, రాజారెడ్డి, మహేశ్వర్‌రెడ్డిలు ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులైన వారిని నమ్మించి ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.2.50 లక్షల నుంచి రూ.3.50 లక్షల దాక వసూలు చేయించుకోని టోకరా పెట్టారు. తమ డబ్బులు తమకు ఇప్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ నిరసన తెలిపారు. నిందితుల నుంచి డబ్బులు ఇప్పించి అరెస్టు చేయాలని అధికారులను కోరారు.

గొర్రెల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

ప్యాపిలి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గొర్రెల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని హుసేనాపురం ప్రభుత్వ వెటర్నరీ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఉషాశ్రీ అన్నారు. గురువారం బావిపల్లి గ్రామంలో వెంకటేశ్వర యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పశువులు, గొర్రెల సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. అనంతర నట్టల నివారణ మందులను గొర్రెల పెంపకందారులకు పంపిణీ చేశారు.






డోన్‌లో వాహనాలకు జెండా ఊపి ప్రారంభిస్తున్న కోట్ల సుజాతమ్మ, మోదీ సభకు తరలివెళ్తున్న టీడీపీ నాయకులతో ధర్మవరం సుబ్బారెడ్డి, ఆళ్లగడ్డ నుంచి మోదీ సభకు తరలివెళ్తున్న మహిళలు, మోదీకి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

మోదీ సభకు తరలిన నాయకులు

డోన్ టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కర్నూలులో జరిగిన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభకు డోన్ నుంచి కూటమి నాయకులు బస్సుల్లో తరలివెళ్లారు. గురువారం ప్రధాని సభకు తరలివెళ్తున్న బస్సులను మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సభకు డోన్ నియోజకవర్గం నుంచి దాదాపు 200 బస్సులు బయలుదేరి వెళ్లాయి. కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ సూపర్ జీఎస్టీతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు టీఈ రాఘవేంద్రగౌడు, మండల అధ్యక్షుడు దశరథరామిరెడ్డి, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నా రు.

ఎంఎస్ఆర్ ఆధ్వర్యంలో: కర్నూలులో జరిగిన ప్రధాని మోదీ సభకు రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కూటమి నాయకులు వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ మోదీ ఉమ్మడి కర్నూలు జిల్లాకు రావడంతో కోట్లాది రూపాయలతో పరిశ్రమలు రావడం హర్షణీయమన్నారు. సూపర్ జీఎస్టీ సక్సెస్ సభను దేశంలోనే మొదటిసారిగా ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేయడంతో దేశ వ్యాప్తంగా కర్నూలు మార్మోగిందన్నారు. సభకు తరలివెళ్లిన వారిలో బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ ప్రజావైద్య శాల మల్లికార్జున, సర్పంచ్ రామిరెడ్డి, రామసుబ్బయ్య పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: ప్రధాని నరేంద్రమోది సభకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో గురువారం కూటమి నాయకులు వాహనాల్లో తరలివెళ్లారు. నియోజకవర్గం నుంచి 300 వాహనాలు, 60 కార్లలో నాయకులు, కార్యకర్తలు వెళ్లినట్లు టీడీపీ మండల కన్వీనర్ శీలం హరికుమార్‌రెడ్డి తెలిపారు. మోది పర్యటనలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు కలిసి సెల్ఫీ ఫొటో సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. అలాగే ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, గౌరుచరితారెడ్డిలు ప్రధానికి మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేస్తున్న ఫొటో కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

డోన్ రూరల్: డోన్ పట్టణం నుంచి జనసేన ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు కర్నూలులో జరిగిన ప్రధాని నరేంద్ర మోదీ సభకు తరలివెళ్లారు. గురువారం జనసేన నియోజకవర్గ నాయకుడు ఆలా మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జనసైనికులు 8 ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో జనసేన యువ నాయకుడు షైఖేల్, నాయకులు నాయక్, మౌలాలి, ఈరయ్య, దస్తగిరి పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: కర్నూలు సమీపంలోని రాగమయూరి గ్రీన్‌హిల్స్‌లో జరిగే ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు మండలంలోని కోవెలకుంట్ల సొసైటీ ఛైర్మన్ గువ్వల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఉదయం భారీ వాహనాల్లో టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు. అలాగే జనసేన నాయకులు, బీజేపీకి చెందిన నాయకులు వాహనాల్లో తరలివెళ్లారు. అంతేకాక మండలంలోని 12 సచివాలయాల నుంచి సుమారు 60 ఆర్టీసీ బస్సుల్లో 3వేల మంది తరలివెళ్లారు.

కొలిమిగుండ్ల: కర్నూలులో జరిగే ప్రధాని మోదీ సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి టీడీపీ నాయకులు తరలివెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ వీఆర్ లక్ష్మీరెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు పేట్నికోట హుస్సేన్‌రెడ్డి, పులి ప్రకాశ్‌రెడ్డి, కొలిమిగుండ్ల సొసైటీ ఛైర్మన్ అంబటి వివేకానందరెడ్డి, నంద్యాల ప్రసాదు, రవిప్రకాశ్‌రెడ్డి, గూలి నాగేశ్వరరెడ్డి, నిమ్మకాయల దస్తగిరి, కల్వటాల కామిని కృష్ణరంగారెడ్డి, కమ్మవారిపల్లె రాందాస్‌లు బయలుదేరి వెళ్లారు. సుమారు 60 ఆర్టీసీ బస్సులు, 50కి పైగా వాహనాల్లో వందలాది మంది కార్యకర్తలు వెళ్లారు.

చాగలమర్రి: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా తెలిపారు. గురువారం చాగలమర్రి గ్రామంలో ప్రధాని మోదీ సభకు తరలివెళ్లేందుకు వివిధ వాహనాల్లో ర్యాలీ నిర్వహించి కర్నూలుకు తరలివెళ్లారు. అంతక ముందు నంద్యాల టీడీపీ మైనార్టీసెల్ నాయకుడు కొలిమి ఉసేన్‌వలి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భూమా అభిమానులకు పీఎస్ డాబా సమీపంలో అల్పాహారం ఏర్పాటు చేశారు. అనంతరం బహిరంగ సభకు తరలివెళ్లారు. టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, నంద్యాల బీసీసెల్ స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు ఉసేన్‌రెడ్డి, టీడీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, ఇండ్ల రమణారెడ్డి, బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో వివిధ వాహనాల్లో తరలివెళ్లారు. ఎంపీడీవో తాహిర్‌హుసేన్, ఏపీఎం నాగమ్మ, వెలుగు సీసీ మహిళలు, పొదుపు మహిళలు, వివిధ శాఖల ఉద్యోగులు, కార్యదర్శులు తరలివెళ్లారు.

బనగానపల్లె: రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పిలుపు మేరకు సూపర్ జీఎస్టీ సభకు కర్నూలు లో ప్రధాని నరేంద్రమోదీ సభకు టీడీపీ నాయకులు, కార్య కర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. నియోజకవర్గంలోని బనగానపల్లె, అవుకు, సంజామల, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల మండలాల నుంచి టీడీపీ నాయకులు తరలివెళ్లారు. పలుకూరు నుంచి మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, గుండం మల్లికార్జునరెడ్డి, వల్లపు శంకర్, మార్కెట్‌యార్డు ఛైర్మన్ కాట్రెడ్డ మల్లికార్జునరెడ్డి, గువ్వల వెంకటసుబ్బారెడ్డి, రామకృష్ణాపురం నుంచి శంకర్, నందివర్గం నుంచి ఉమామ హేశ్వరరావు, నందవరం నుంచి పీవీ.కుమార్‌రెడ్డి, వెంకటాపురం నుంచి గడ్డం నాగేశ్వరరెడ్డి, కైప నుంచి రఘునాథరెడ్డి, బనగానపల్లె నుంచి ఉపసర్పంచ్ బురానుద్దీన్, కాశీంబాబు, మంగంపేట నుంచి శ్రీనివాసులుతోపాటు బీజేపీ, జనసేన నాయకులు వాహనాల్లో తరలివెళ్లారు.

ఉయ్యాలవాడ: మండలంలోని కూటమి నాయకులు, కార్య కర్తలు కర్నూలులో గురువారం జరిగే మోదీ బహిరంగ సభకు తరలి వెళ్లారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 30 బస్సుల్లో దాదాపుగా 1200 మంది తలరి వెళ్లినట్లు అధికా రులు తెలిపారు. వీరి కావలసిన ఏర్పాట్లను ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సమకూర్చినట్లు తెలిపారు.

ప్యాపిలి: కర్నూలులో జరిగే ప్రధాని మోదీ బహిరంగ సభకు గురువారం మండలం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. దాదాపు 200 వాహనాల్లో సభకు తరలి వెళ్లారు.

శిరివెళ్ల: ప్రధాని నరేంద్ర మోదీ కర్నూలు జిల్లాలో నిర్వహించిన భారీ బహిరంగసభకు కూటమి శ్రేణులు గురువారం భారీగా తరలివెళ్లారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి మహిళలు, కార్యకర్తలు ఉత్సాహంగా సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ సభకు హాజరయ్యారు.

అవుకు: కర్నూలు సమీపంలోని రాగమయూరి ఆవరణలో నిర్వహించిన మోదీ సభకు అవుకు మండలం నుంచి 40 బస్సుల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. రామాపురం నుంచి టీడీపీ నాయకులు ఐవీ పక్కీరరెడ్డి, ఉగ్రసేనారెడ్డి ఎస్‌రామకృష్ణారెడ్డి, మారం పుల్లారెడ్డి, గుండ్లశింగవరం నుంచి చంద్రశేఖర్‌రెడ్డి, కోనాపురం నుంచి పరమేశ్వర రెడ్డి, కాశీపురం మొట్ల రామిరెడ్డి, చెర్లోపల్లె నుంచి బాలనాగిరెడ్డి, శివరామిరెడ్డి, అవుకు నుంచి వెంకటరమణనాయక్, దంతెల రమణ, తిక్కన్న, అరుణ్ కుమార్ నాయక్, సుంకేసుల నుంచి రామచంద్రారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శింగనపల్లె నుంచి సాంబశివారెడ్డి, కునుకుంట్ల నుంచి వెంకటరామిరెడ్డి, తులసిరెడ్డి, ప్రసాద్, ఉప్పలపాడు ఇస్మాయిల్ ఖాన్, జూనూతల నుంచి వెంకటేష్, కొండమనాయునిపల్లె నుంచి నాగిరెడ్డి, మెట్టుపల్లె నుంచి జగన్‌మోహన్‌రెడ్డి, రామవరం నుంచి బ్రహ్మం, టీడీపీ, బీజేపీ, జన సేన నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

దొర్నిపాడు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ మండలనాయకులు సిద్ధి సత్యం, బొబ్బూరి వెంకటస్వామి, కొత్తపల్లి సురేంద్ర, శివకుమార్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, వెంకట్‌నాయుడు, చక్రవర్తి నాయుడు, తాళ్లూరి రమేష్‌నాయుడులు అన్నారు. గురువారం దొర్నిపాడు మండలం నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లా నన్నూరులో జరిగే మోదీ సభకు టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ నాయకులు కార్యకర్తలు వాహనాల్లో తరలివెళ్లారు.



పలుకూరు: మోదీ సభకు వెళ్తున్న టీడీపీ నాయకులు



చాగలమర్రి: మోదీ సభకు తరలివెళ్తున్న టీడీపీ నాయకులు



కొలిమిగుండ్లలో..

రుద్రవరం: మోదీ సభకు రుద్రవరం మండలం నుంచి గురువారం భారీగా తరలివెళ్లారు. రుద్రవరం నుంచి మండల టీడీపీ కన్వీనరు రంగనాయకులు, కోలా గురుమూర్తి, నంద్యాల పార్లమెంటు ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కొమ్మలపాటి రాజారావు, చంద్రశేఖర్, ఆలమూరు నుంచి పత్తి వెంకటనారాయణ, పెద్దకంబలూరు నుంచి టీడీపీ నాయకులు ఎర్రం ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలు తరలివెళ్లారు. రుద్రవరం మండలానికి 48 బస్సులు కేటాయించినట్లు ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు.

బేతంచెర్ల: మోదీ సభకు బేతంచెర్ల మండలంలోని అంబాపురం గ్రామం నుంచి సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్లారు. దాదాపు 75 ఆర్టీసీ బస్సులో ప్రజలు, పొదుపు మహిళలు తరలివెళ్లారు. మండలంలోని సీతారామపురం తదితర గ్రామాల నుంచే గాక బేతంచెర్ల కోటపేట, పట్టణం నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీగా తరలివెళ్లారు.

సంజామల: కర్నూలులో జరిగిన మోదీ సభకు మండలం నుంచి కూటమి నాయకులు భారీగా తరలివెళ్లారు. పేరుసోముల నుంచి సురేష్ రెడ్డి, శంకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, కానాల నుంచి కేశవ రెడ్డి, శేషారెడ్డి, లింగందిన్నె నుంచి బండి ప్రతాప్ రెడ్డి, గిద్దలూరు నుంచి బత్తుల ప్రతాప్ రెడ్డి, రామిరెడ్డిపల్లె నుంచి మంచాల మద్దిలేటి రెడ్డి, సంజామల నుంచి మల్కి హుసేన్, మద్దిలేటి తదితరులు తరలివెళ్లారు.






అవుకు మండలం సుంకేశుల, ఉయ్యాలవాడ, బేతంచెర్ల మండలం అంబాపురం, సంజామలలో ప్రధాని నరేంద్ర మోదీ సభకు తరలివెళ్తున్న టీడీపీ నాయకులు

కార్యకర్తలకు అభినందనలు: మంత్రి బీసీ

బనగానపల్లె, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కర్నూలు సమీపంలోని నన్నూ రు రాగమయూరి ఆవరణలో నిర్వహించిన సూపర్‌జీఎస్టీ, సూపర్‌సేవింగ్ ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏర్పాటు చేసిన సభకు బనగానపల్లె నియోజకవర్గం నుంచి లక్షలాదిగా తరలి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి గురువారం కృతజ్ఞతలు తెలిపారు. బనగా నపల్లె నియోజకవర్గంలోని 5 మండలాల నుంచి 265 బస్సుల్లో కూటమి కార్యకర్తలతోపాటు నాయకులు, మహిళలు తరలివచ్చారని తెలిపారు. ఈస మావేశానికి అన్ని విధాలుగా సహకరించిన సచివాలయ సిబ్బంది, ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. అలాగే సభ విజ యవంతానికి పోలీస్ సిబ్బంది కూడా తమకు సంపూర్ణ సహకారం అందిం చారన్నారు. సుమారు 13,500 కోట్ల పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్స వాలు, జాతికి అంకితం చేయడడం వంటి ప్రతి ష్టాత్మక కార్యక్రమాలకు కర్నూలు వేదికగా నిలవడం, ప్రధాని నరేంద్రమోదీ చేతులమీదుగా ప్రారం భించడం సీమ వాసులుగా అందరికీ గర్వకారణమన్నారు. రాయలసీమ పారిశ్రామిక హబ్‌గా మారబోతోందన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీతో ప్రతి కుటుంబం ఏడాదికి రూ.20వేల వరకు ఆదా కావ డంతో ముందే పేదల ఇళ్లల్లో దీపావళి పండుగ ప్రారంభమైనట్లు తెలిపారు. జీఎస్టీ ధరలు తగ్గడంతో వ్యాపారాలు పుంజుకొని ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. విశాఖలో గూగ్‌లో డాటా సెం టర్, ఉత్తరాంధ్ర డెస్టినేషన్ హబ్‌గా మారనుందన్నారు. త్వరితగతిన నిర్మా ణాలు పూర్తి చేసుకోవడం ద్వారా అమరావతి ప్రపంచ స్థాయి రాజధానిగా మారడం ఖాయమన్నారు. ప్రధాని, సీఎం నేతృత్వంలో 3 ప్రాంతాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయన్నారు. చంద్రబాబు నాయకత్వంలో సహచర మంత్రులుగా రాష్ట్రాభివృద్ధిలో తాము భాగస్వామ్యులు కావడం అదృష్టమన్నారు.



భోజన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

భోజన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి బీసీ : ప్రధాని మోదీ సభకు బయలు దేరిన ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళల కోసం నంద్యాల-కర్నూలు రోడ్డులో ఏర్పాటు చేసిన ఫుడ్‌స్టాల్‌ను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఫుడ్‌స్టాల్‌లో ఏర్పాటు చేసిన పలు వంటకాలను, ఆహారపదార్థాల నాణ్యతను పరిశీలించారు. సభకు వచ్చే ప్రజలు, కూటమి పార్టీ నేతలకు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆహార పదార్థాలు, తాగునీరు అందించాలని నిర్వాహకులకు మంత్రి సూచించారు.

19వ బ్లాక్ చానెల్‌కు గండి

రుద్రవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ 19వ బ్లాక్ చానెల్‌కు డ్రాప్ వద్ద గండి పడిందని రైతులు గురువారం తెలిపారు. అప్పనపల్లె గ్రామ సమీపంలో పడడంతో నీరంతా వృథాగా పోతుందని. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి గండికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



అప్పనపల్లె సమీపంలో 19వ బ్లాక్ చానెల్‌కు డ్రాప్ వద్ద పడిన గండి

రవి కుంచె నుంచి జాలువారిన మోదీ చిత్రం

రుద్రవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరుకు చెందిన దివ్యాంగ చిత్రకారుడు రవి దేశ ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటాన్ని గీశాడు. శుక్రవారం మోదీ చిత్రపటాన్ని ప్రదర్శించాడు. ప్రధాని నరేంద్రమోదీ లేగదూడను నెమురుతున్న ఫొటో ప్రజలను ఆకట్టుకుంది. దేశ నాయకుడి చిత్రపటం గీయడం సంతోషంగా ఉందని చిత్రకారుడు రవి అన్నారు.



ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటంతో చిత్రకారుడు రవి

చైన్ స్నాచరైన పోలీసు

అవాక్కవుతున్న ప్రజలు

డోన్ టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): చైన్ స్నాచింగ్‌లను అరికట్టాల్సిన పోలీసే చైన్ స్నాచర్‌గా మారాడు. ఈఘటన డోన్ పట్టణంలో చోటుచేసుకు న్నట్లు అర్బన్ సీఐ ఇంతియాజ్ బాషా తెలిపారు. వివరాలు.. పట్టణంలోని శ్రీరామనగర్‌లో ఓ మెడికల్ షాపులో ఒంటరిగా ఉన్న మహిళను బెదిరించి మంగళవారం రాత్రి ఆమె మెడలోని బంగారు గొలుసును చైన్‌స్నాచర్ లాక్కెళ్లాడు. ఆ మహిళ గట్టిగా కేకలు వేయడంతో అక్కడున్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బుధవారం బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో ఆ చైన్ స్నాచర్ ఓ పోలీసు అని నిర్ధారణ అయింది. కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఈశ్వరయ్య ఆచారి అని తేలడంతో పోలీసులు, ప్రజలు అవాక్కయ్యారు. ఆయన పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ మూడు నెలల నుంచి సిక్ లీవ్‌లో ఉన్నాడు. అతడిని విచారించగా అప్పుల బాధతో మద్యం మత్తులో ఉండి ఈ ఘటనకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. ఈశ్వరయ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పోలీసే దొంగగా మారడం దారుణం: సీపీఐ

డోన్ రూరల్, అక్టోబరు 16: పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఈశ్వరాచారి దొంగతనం కేసులో పట్టుబడటం దారుణమని సీపీఐ పట్టణ కార్యదర్శి మోటరాముడు అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మోటరాముడు మాట్లా డారు. పట్టణంలో జరుగుతున్న దొంగతనాలను అరికట్టాల్సిన పోలీసులే తలదించుకునేలా కానిస్టేబుల్ మహిళ మెడలోని బంగారు గొలుసు అపహరిస్తూ దొరికిపోవడం దారుణమన్నారు. సీపీఐ సహాయ కార్యదర్శి రామ్మోహన్ నాయుడు, నాయకులు అబ్బాస్, కొండయ్య పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అరెస్టు

డోన్ టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): చైన్ స్నాచింగ్ కేసులో అర్బన్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తూ లీవ్‌లో ఉన్న ఈశ్వరయ్య ఆచారి అరెస్టు అయ్యారు. పట్టణంలోని అర్బన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ ఇంతియాజ్ బాషా గురువారం వివరాలు వెల్లడించారు. ఈశ్వరయ్య ఆచారిని గొలుసు దొంగ తనంలో అరెస్టు చేసి కోర్టులో జడ్జి ముందు హాజరు పరచగా.. నిందితుడికి 15 రోజులు జ్యూడీషియల్ కస్టడి విధించినట్లు తెలిపారు. పోలీసు శాఖలో పని చేస్తూ చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడితే.. ఎంతటి వారైనా సరే చర్యలు తీసుకుం టామని తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న అర్బన్ సీఐ